లోపించిన పారిశుధ్య నిర్వహణ

- ఇబ్బందుల్లో సారంగపూర్ గ్రామ ప్రజలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధి, అధికారులు



సారంగపూర్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త



నాణ్యత లేకుండా నిర్మించడంతో కంకర తేలిన రోడ్డు

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్(18వ డివిజన్)లో సమస్యలు తిష్టవేశాయి. గ్రామంలో కంకర తేలిన రోడ్లు, అపరిశుభ్రంగా మారిన డ్రైనేజీలు, అధ్వానంగా తయారైన పరిసరాలతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో గ్రామంలో వేసిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో కంకర తేలింది. దాంతో రోడ్డుపై గుంతలు పడి నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో అన్ని గల్లీల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

డ్రైనేజీల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గ్రామంలో మురుగునీరు బయటకు వెళ్లేందుకు నిర్మించిన డ్రైనేజీల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నా చర్యలు తీసుకోవటంలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలో పేరుకుపోతున్న చెత్తను తామే తొలగిస్తున్నామని, మున్సిపల్ సిబ్బందికి తెలిపినా ఎటువంటి ఫలితం లేకుండా పోతోందన్నారు. రోడ్లను కూడా శుభ్రం చేయడం లేదని మహిళలు వాపోతున్నారు.

ముఖం చాటేసిన కార్పొరేటర్..

సారంగపూర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కార్పొరేటర్ హరుమ్‌ఖాన్ ఎన్నికల్లో గెలిచాక ఇప్పటివరకు మా కాలనీలో సమస్యల గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మా సమస్యలు కార్పొరేటర్‌కు చెబుదామంటే అందుబాటులో ఉండటం లేదని వాపోయారు.

సిబ్బంది కొరత ఉంది



సారంగపూర్‌లో పారిశుధ్య పనులు చేసేందుకు తగిన సిబ్బంది లేకపోవటంతో రోడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. డ్రైనేజీలో చెత్త పేరుకుపోయింది. సమస్యల గురించి తెలుసుకునేందుకు కార్పొరేటర్ ఇటువైపు రాక సంవత్సరాలు గడుస్తున్నాయి. మున్సిపల్ అధికారులు శానిటేషన్ సిబ్బందిని పెంచాలి. ఉన్న సిబ్బంది సరిగ్గా పనిచేయరు.

–హరిలాల్, సారంగపూర్

విద్యుత్ మరమ్మతులు చేపట్టారు



హుస్సేన్‌నగర్‌లో స్తంభాలను సరి చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామ శివారు పొలాల్లో వంగిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పొలాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై సాక్షిలో శుక్రవారం 'గాల్లో రైతుల ప్రాణాలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన డిచ్‌పల్లి ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్ జాడే వెంటనే మరమ్మతులు చేపట్టాలని గడ్కోల్, సిరికొండ సెక్షన్ ఏఈలు శివకుమార్, చంద్రశేఖర్‌లను ఆదేశించారు. డీఈ ఆదేశాల మేరకు గడ్కోల్ ఏఈ శివకుమార్ తన సెక్షన్ పరిధిలోని హుస్సేన్‌నగర్‌లో బుద్దులవాని చెరువు కట్ట కింద పొలాల్లో వంగిపోయి రైతుల పాలిట ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను సరి చేయించారు. తమ సమస్య పరిష్కారం కావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలకు ఆదేశం

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్లే స్కూల్స్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు ఇవ్వాలన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలల కథనంపై స్పందించిన ఆయన ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

అధికారంలోకి వస్తే ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు

కాంగ్రెస్ నేత తాహెర్‌బిన్ హుందాన్



మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హుందాన్, పాల్గొన్న నగర అధ్యక్షుడు కేశ వేణు తదితరులు

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, కాంగ్రెస్ నగర పార్టీ అధ్యక్షుడు కేశవేణులు అన్నారు. నగరంలోని 46వ డివిజన్‌లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీ పెట్రోల్ బంక్, పూలాంగ్ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చే పథకాల గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. నగరంలో ఇంతవరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వలేదన్నారు. ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు చెల్లిస్తామని చెప్పినా ఇంత వరకు ఒక్కలబ్ధిదారునికి కూడా ఇవ్వలేదన్నారు. నిత్యావసర వస్తువులపైన జీఎస్‌టీని రద్దు చేస్తామన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తామన్నారు. రూ.500 లకు గ్యాస్‌సిలిండర్‌లను అందిస్తామన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి అందిస్తామన్నారు. నాయకులు రామర్తి గోపి, ఆయుబ్, సయ్యద్ కైసర్, వేణు రాజ్, గడుగు రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఇందూరు విజయయాత్ర

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఇందూరు విజయ యాత్ర కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా నగరంలోని కిసాన్‌గంజ్ ఆర్యవైశ్య సంఘం కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉదయం 7 గంటల నుంచి 9.30 వరకు భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం మహా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళేశ్వర పూజ, సామవేద పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహాపూజ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు హారతి ఇచ్చారు. అనంతరం పెండ్లి కాని అబ్బాయిలు, అమ్మాయిలకు స్వామిజీ ఆశ్వీరచనాలు అందించారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

నిజామాబాద్‌అర్బన్: ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో ఖలీల్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ నేత మహేశ్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరత తీవ్రంగా ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేసుకొని 9 ఏళ్లు అయినా ప్రభుత్వ విద్యాసంస్థల పరిస్థితి దయనీయంగా ఉందన్నరు. అలాగే ఖలీల్ వాడి స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయ పోస్టు 4 ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్నా కనీసం విద్యా వాలంటీర్లను కూడా నియమించకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు గణేశ్, రామ్, నరేశ్, రమ్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు

'గతంలోనే పార్టీ నుంచి సస్పెండ్ చేశాం'



సిరికొండ: బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు గంగ నర్సయ్యను పార్టీ నుంచి ఐదు నెలల క్రితమే సస్పెండ్ చేశామని బీఆర్‌ఎస్ గడ్కోల్ గ్రామ శాఖ అధ్యక్షుడు గడీల శ్రీనివాస్ తెలిపారు. గడ్కోల్‌లో శుక్రవారం పార్టీ నాయకులు మాట్లాడుతూ..పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున నర్సయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఆయనకు బీఆర్‌ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. సోసైటీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ గంగారెడ్డి, జీకే రెడ్డి, నర్సారెడ్డి, మహిపాల్, మచ్చర్ల గంగాధర్ ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో కోటగిరి మండలం కొత్తపల్లికి చెందిన కెతావత్ రవికి సెల్‌ఫోన్‌ను శుక్రవారం ఎస్‌హెచ్‌వో మహేశ్ అప్పగించారు. మూడ్రోజుల క్రితం మోపాల్ మండలానికి వచ్చిన కెతావత్ రవి సెల్‌ఫోన్ పడిపోవడంతో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఫోన్‌కు సంబంధించిన వివరాలు యాప్‌లో నమోదు చేసుకుని లొకేషన్ ఆధారంగా ఎక్కడ వినియోగిస్తున్నారో తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఫోన్‌ను గుర్తించడంలో చురుకుగా వ్యవహరించిన నరసింహ మూర్తిని ఎస్‌హెచ్‌వో మహేశ్ అభినందించారు. తన ఫోన్ దొరికినందుకు బాధితుడు సంతోషం వ్యక్తం చేసి, పోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎల్ఐసీ ఏజెంట్‌కు సన్మానం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ గోవూరు భూమారెడ్డి దంపతులను ఎల్ఐసీ మేనేజర్ యుగేందర్, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ యుగేందర్ మాట్లాడుతూ.. భూమారెడ్డి నెల రోజుల్లో 50 ఎల్ఐసీ పాలసీలు చేయించారని, మరో 50 పాలసీలకు గ్రామస్తులు సహకరించాలని తెలిపారు. 100 పాలసీలు చేస్తే బీమా గ్రామం కింద అభివృద్ధి కోసం ఎల్ఐసీ ద్వారా రూ.లక్ష నిధులు మంజూరవుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మంచిప్ప గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ సక్రు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ గోపాల్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ జగదీష్, గ్రామస్తులు శ్రీనివాస్ యాదవ్, వెంకట్రాం, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసును ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న న్యూడెమోక్రసీ నాయకులు

ఖలీల్‌వాడి: ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు ప్రజా సంఘాల నాయకులపై ఉపా చట్టం కింద బనాయించిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలో భగత్ సింగ్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి నిలదీసే గొంతుకలను ఉక్కుపాదంతో అణచివేయుటలో భాగంగానే ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు 151మందిపై కేసులను రాష్ట్ర ప్రభుత్వం బనాయించిందన్నారు. ఉపా చట్టం చాలా చాలా దుర్మార్గమైందని, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వామపక్షవాదులపై కేసులు పెట్టాలని ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేల్పూర్ భూమయ్య, పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, సాయి రెడ్డి, గౌతమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దాసు

జక్రాన్‌పల్లి: గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జీపీ కార్మికులను సన్మానించారన్నారు. అందులో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్, హరీష్‌రావులు కార్మికుల వేతనాలు పెంచి, సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించలేదన్నారు. సఫాయి కార్మికుల జీవితాలను అర్థం చేసుకుని వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. జక్రాన్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శి సొప్పరి గంగాధర్, రేణుకా, లక్ష్మీ, రాజగంగు, తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించండి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: బాసర్ ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించి సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గిరిరాజ్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను పీడీఎస్‌యూ నాయకులు దహనం చేశారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్నారపు రాజేశ్వర్‌లు వేర్వేరుగా మాట్లాడారు. కొన్ని నెలల క్రితం విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేశారని, అదే విధంగా రెండు రోజుల క్రితం తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు ధర్నా చేస్తుంటే అక్కడున్న అధికారులు బెదిరించారని అదే మనస్తాపంతో లిఖిత, దీపిక విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సామూహిక అక్షరాభ్యాసం



విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు, తల్లిదండ్రులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. వేసవి సెలవుల తర్వాత ఇటీవల పాఠశాలలు తెరుచుకున్నాయి. పాఠశాలలో నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల హెచ్‌ఎం శోభ, హైస్కూల్ హెచ్‌ఎం గోపాలచారి, వీడీసీ అధ్యక్షుడు నవీన్, ఉపసర్పంచ్ జగదీష్, అంగన్‌వాడీలు వరలక్ష్మీ, గంగు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం..

రేపు శ్రీవైష్ణవ ఆత్మీయ సమ్మేళనం

నిజామాబాద్ సిటీ: నగరంలోని చక్రం గుడిలో రేపు(ఆదివారం) శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి(శ్వాస్), చక్రం గుడి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీవైష్ణవ ఆత్మీయ సమ్మేళనము నిర్వహించనున్నట్లు శ్వాస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నాని స్వామి(కందాళై నర్సింహమూర్తి) తెలిపారు. ఈ కార్యక్రమం త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనములతో త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారి పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు ఈ సమ్మేళనం జరుగనుంది.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం



40వ డివిజన్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 40వ డివిజన్ గౌతమ్‌నగర్‌లో రూ.కోటి టీయూఎఫ్ఐడీసీ నిధులతో బీటీ రోడ్డు పనులకు శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ న్యామతబాద్ శివచరణ్, కో–ఆప్షన్ సభ్యులు టి.చంద్రకళ, మాజీ కార్పొరేటర్ మాయవార్ సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ ఎంప్లాయీస్ కార్యవర్గం



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయీస్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సుజాత, ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, అంజుల్ రెడ్డి, పద్మ, ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగేందర్, కోశాధికారిగా ఎంఏ రషీద్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి జిల్లా జడ్జి సునీత కుంచాల అభినందనలు తెలిపారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న డీపీఎం ఎఫ్ఐ నీలిమ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవిలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమంలో ఐకేపీ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ నీలిమ స్వయం సహాయక సంఘాల సభ్యులకు, గ్రామ ప్రజలకు ఆర్థిక సేవలు, డిజిటల్ లావాదేవిలు, సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఎంపీటీసీ అంకాల గంగాధర్, ఉప సర్పంచ్ శంకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీధర్, ఎస్‌బీఐ మేనేజర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష పథకంలో పద్మశాలీలను చేర్చాలి

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వం అందించే రూ.లక్ష పథకంలో పద్మశాలీలను చేర్చాలని జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు లక్కపతిని బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మూడా రవి ప్రభుత్వాన్ని శుక్రవారం కోరారు. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా చేతివృత్తిదారులకు ఉపాధి కల్పన కింద ప్రవేశ పెట్టిన రూ.లక్ష పథకంలో పద్మశాలీలను కూడా చేర్చి ఆదుకోవాలన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,050	వెండి (కిలో)	75,700
22 క్యారెట్స్	56,286	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	32	60	క్యాప్సికం	60	80
బెండకాయ	25	50	గాజరుగడ్డ	30	50
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
దొండకాయ	25	50	దోసకాయ	10	20
బీర్నీసుకాయ	150	200	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	35	50	గోబిగడ్డ	15	30
వంకాయ	20	40	గోబిపువ్వు	30	50
పాలకూర	40	60	బీట్‌రూట్	30	50
మెంతికూర	70	90	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	80	100	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఆది పురుష్(తెలుగు) -9.00,12.30 4.00,7.30,10.55
స్క్రీన్-3	ది ఫ్లాష్-(ఇంగ్లీష్) - 11.00,1.50 4.40,7.30,10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆది పురుష్(తెలుగు)- 3డీ -8.00, 11.45,3.30,7.15,11.00
స్క్రీన్-2	ఆది పురుష్(తెలుగు) -3డీ-11.00, 2.45,6.30,10.15
స్క్రీన్-3	ఆది పురుష్(తెలుగు)- 2డీ -10.30 2.15,6.00,9.45
స్క్రీన్-4	ది ఫ్లాష్(తెలుగు) -12.45 ట్రాన్స్‌ఫార్మర్స్(ఇంగ్లీష్)2డీ -3.55 ది ఫ్లాష్(ఇంగ్లీష్) -6.50,10.00
దేవి	విమానం
నటరాజ్	ఆది పురుష్(హిందీ)
లలితామహల్	ఆది పురుష్(తెలుగు)
విజయ్	ఆది పురుష్(తెలుగు)

టౌన్ ప్లానింగ్ అధికారులపై కమిషనర్‌కు ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: డబ్బులు ఇస్తేనే పర్మిషన్ ఇస్తామని ఇబ్బందులకు గురిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై కమిషనర్ చిత్రామిశ్రాకు శుక్రవారం మున్సిపల్ లైసెన్స్ ఇంజనీర్ బట్టు రాము ఫిర్యాదు చేశారు. నగరంలోని 221 గజాలకు సంబంధించిన కొత్త ఇళ్ల నిర్మాణ అనుమతి కోసం ఆన్‌లైన్‌లో మే 26న ఓ వ్యక్తి దరఖాస్తు చేశారు. సైట్ ఇన్‌స్పెక్షన్ అధికారి ఒకే చెప్పారు. అయినా టైటిల్, టెక్నికల్ ఆఫీసర్లు వెంకటేశ్, ప్రవీణ్‌లు డబ్బులు ఇస్తేనే అనుమతి ఇస్తామని తేల్చిచెప్పారు. నేను డబ్బులు ఇవ్వలేనని ఏదైనా ఉంటే ఇంటి యజమానితో మాట్లాడాలని చెప్పానని తెలిపారు. అధికారులు ఆన్‌లైన్‌లో నాట్ రికమండ్ ఆప్షన్ ఎంచుకొని ఫైల్ క్లోజ్ చేశారు. దీనిపైన కమిషనర్ విచారణ చేయించి అనుమతి ఇప్పించాలన్నారు. అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

ఆర్మూర్‌టౌన్: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి, ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేయడాన్ని నిరసిస్తూ ఆర్మూర్ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో మంజూరైన రూ.70 కోట్ల నిధులను ఇప్పుడు మంజూరైనట్లు చెప్పడం సరికాదన్నారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో సరిపడా వైద్యులు లేరని, మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్మూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. నాయకులు పాలేపు రాజు, కొంతం మురళీ, ద్యాగ ఉదయ్, పులి యుగేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు నిర్ణయించారు. తెయూ ఆర్ట్స్ కళాశాల మినీ సెమినార్ హాల్‌లో శుక్రవారం వారు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రెగ్యులరైజ్ కావడానికి ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే విషయాలపై చర్చించారు. ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసే వరకు తమ పోరాటం కొనసాగించాలని నిర్ణయించారు.

సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను వెంటనే మంజూరు చేయాలని ఎంపీపీ పస్క నర్సయ్య రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..దేగాం పీహెచ్‌సీ కేంద్ర ప్రభుత్వ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు స్టాండర్డ్స్ పథకానికి ఎంపిక కావడానికి కృషి చేసిన వైద్య సిబ్బందిని అభినందించారు. అనంతరం అధికారులు తమ శాఖల పనితీరును సమావేశంలో చదివి వినిపించారు.